క్లుప్తంగా

గ్రామాల్లో వైద్య శిబిరాలు



మురళీగూడలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 136 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న 24మంది రక్త నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటి ఆవరణలో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. శిబిరంలో మెడికల్ అధికారి సతీష్, సీహెచ్‌వో అనర్ధ హల్దార్, ఎల్‌టీ నాగరాజు, హెచ్ఏ ధర్మరావు, ఏఎస్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ



హద్దులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామంలో ప్రభుత్వ భూములను ఆక్రమించారని గ్రామస్తులు ఆర్డీవో కార్యాలయంలో ఇటీవల ఫిర్యాదు చేయగా.. గురువారం పెంచికల్‌పేట్ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో సర్వే చేపట్టారు. మద్దెను కుంట సమీపంలోని కెనాల్ వద్ద ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చేడ్వాయి గ్రామంలోని మద్దెను కుంట వద్ద సర్వే నిర్వహించామన్నారు. నివేదికను ఉన్నత అధికారులకు అందచేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ సురేశ్, సర్వేయర్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి: నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పించనున్నట్లు ట్రైనర్ కద్దం రవి ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లిలోని ఐటీడీఏ వైటీపీ ట్రైనింగ్ సెంటర్‌లలో 18 నుంచి 35 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్, హౌజ్ వైరింగ్, ప్లంబింగ్, సానిటేషన్ విభాగాల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 83285 07232, 99661 10045 సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలల్లో గురువారం స్న్యూర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలసా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్న్యూర్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.రంజిత్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో చిన్నారులకు ఇబ్బందులు తలెత్తుతాయని, బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ దివాకర్, ప్రధానోపాధ్యాయుడు సదాశివుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయాలి

తిర్యాణి: ప్రతిఒక్కరూ పేదలకు సేవ చేయాలని ఆసిఫాబాద్ మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని ఉల్లిపిట్ట గ్రామంలో రామ్‌లీలా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ విమలనంద జ్ఞాపకార్థం నిర్వహించిన వైద్యశిబిరానికి హాజరయ్యారు. మూరుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు విశాక, రిషిక, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన

వాంకిడి: మండల కేంద్రంలోని అర్జుగూడ పాఠశాల విద్యార్థులకు గురువారం కాంగ్రెస్ నాయకులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పంచాయతీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉద్యాన’ సాగుకు ప్రోత్సాహం



భట్టుపల్లిలో ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- పండ్ల తోటల రైతులకు రాయితీ
- జిల్లాలో ఈఏడాది 45 ఎకరాల్లో సాగు లక్ష్యం
- మరో 700 ఎకరాల్లో ఆయిల్‌పామ్
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: భిన్నమైన నేలలు కలిగిన జిల్లాలో ఇప్పటికీ పత్తి పంటే అధికంగా సాగవుతోంది. ఇప్పుడిప్పుడే రైతులు అధిక లాభాలు వచ్చే వాణిజ్య పంటలు, పండ్ల తోటలు, పూలు, కూరగాయల సాగుకు ముందడుగు వేస్తున్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రోత్సాహం అందిస్తోంది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో పండ్ల తోటల సాగు పెంచేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా నూతనంగా 700 ఎకరాల్లో ఆయిల్‌పామ్, 45 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 900 ఎకరాల్లో పండ్ల తోటలు, ఇందులో అధిక శాతం మామిడి తోటలు ఉన్నాయి. 1100 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగు ఇలా..

ఆయిల్‌పామ్ మొక్క నాటిన నాలుగేళ్ల తర్వాత దిగుబడి వస్తుంది. ఏడేళ్ల నుంచి ఎనిమిదేళ్ల తర్వాత నుంచి ఎకరానికి పది క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చు. ఇలా ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం రైతులకు వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎకరానికి త్రిభుజాకార పద్ధతిలో అయితే 9 మీటర్ల దూరంలో 57 మొక్కలు, అదే చతురస్రాకార పద్ధతిలో 50 మొక్కలు నాటాల్సి ఉంటుంది. వీటికి రైతులు ఒక మొక్కకు రూ. 20 చెల్లిస్తే కంపనీ నుంచి సరఫరా చేస్తారు. దీనికి సంబంధించిన సబ్సిడీ మొత్తం మొక్కకు రూ. 193 ప్రభుత్వం కంపనీ చెల్లిస్తోంది. అదే విధంగా మొదటి నాలుగు సంవత్సరాల్లో తోటల యాజమాన్యం కోసం, అంతర పంటల సాగుకు ఎకరాకు రూ. 4,200 చొప్పున నాలుగేళ్ల వరకు నిధులు ఇవ్వనుంది. దీంతో పాటు సూక్ష్మ నీటిపారుదల పథకం (టీజీఎంఐపీ)లో భాగంగా ఈ ఏడాది ఉద్యాన పంటలైన పూలసాగు, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలకు అవకాశం కల్పించింది.

రాయితీ ఇలా..

ఆయిల్‌ఫామ్ సాగులో భాగంగా ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించి ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ, బీసీ, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ, పెద్ద రైతులకు 80 శాతం రాయితీపై బిందుసేద్యం పరికరాలు సరఫరా చేయనుంది. ఈసంవత్సరం జిల్లాకు 700 ఎకరాల లక్ష్యంగా నిర్దేశించారు. ఆయిల్‌ఫామ్ మొక్కలు పెంచి రైతులకు సరఫరా చేసే బాధ్యతను ఓ ప్రైవేటు కంపనీకి (మాట్రిక్స్ ఆయిల్‌ఫామ్) అప్పగించారు. ప్రభుత్వ ఒప్పంద ప్రకారం సంబంధిత కంపనీ నిర్దేశించిన ధరకు పంటలను కొనుగోలు చేస్తుంది. ఈఏడాది జిల్లాలో 163 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు.

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరం 700 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించాం. పండ్లు, కూరగాయలు, పూల తోటలు సాగు చేయవచ్చు. ఆసక్తి ఉన్న రైతులు బిందు సేద్యం పరికరాలకు ఉద్యాన అధికారులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలి.

– వెంకటేశ్, జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఆసిఫాబాద్‌అర్బన్: భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్‌ల ఆధ్వర్యంలో నాయకులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు తనవంతుగా రక్తదానం చేశారు. ఆరోగ్యవంతులు ప్రతిఒక్కరూ ప్రతి మూడు నెలలకొసారి రక్తదానం చేయవచ్చన్నారు. దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు సేవా హస్తం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ చెన్నకేశవ్ రావ్, హర్షవర్ధన్, క్రిష్ణ, నవీద్, మాజీ ఎంపీపీ మల్లిఖార్జున్, కొంగ సత్యనారాయణ, సుచిత్, అరుణ్‌లోయ, వీరభద్రాచారి, సొల్లు లక్ష్మి, సిద్దంశెట్టి సుహాసిని పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



సీమంతం చేస్తున్న అధికారులు

కౌటాల: గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూ పాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహా రంపై అవగాహన కలిగి ఉండాలని, గర్భిణులు పరీక్షలు చేసుకోవాలని, అర్హులైన వారు అంగన్‌వాడీ సే వలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోషణ మాసం ప్రోగాం అధికారులు గోపాలకృష్ణ, సూపర్‌వైజర్లు షకీరా బేగం, పద్మ, కరుణ, కార్యదర్శులు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు

ఉట్నూర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, నిరుద్యోగులకు పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు పొందవచ్చని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూరు మండలంలోని కల్లూరుగూడ గ్రామంలో 360 పెరటి కోళ్లు పంపిణీ చేశారు. ముందుగా సంస్థ శాస్త్రవేత్తలు పెరటి కోళ్ల పెంపకంపై, లాభాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కోళ్లు అధిక బరువు కలిగి ఉంటాయని, అధిక మాంసం, గుడ్లు పెడుతాయన్నారు. స్వయం ఉపాధి పొందేందుకు సర్కార్ వారు పెరటి కోళ్ల పెంపకంలో శిక్షణ ఇస్తారని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాటు కోళ్లతో పోల్చితే పెరటి కోళ్లు తక్కువ రోజుల్లో పెరుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ సైంటిస్టు బి.ప్రకాష్, రాజకుమార్, విజయ్ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ ఎస్కే బాంజా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

వాంకిడి: జీవో 317 సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. గురువా రం సంఘం సభ్యులతో కలిసి మండలంలోని వివిధ పాఠశాలల ను సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా స్థానికత ఆధారంగా ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ నివేదికను తె ప్పించుకుని అమలు చేయాలని, కార్యక్రమంలో మండల కార్యదర్శి బండె హరీశ్, కేజీబీవీ ఎస్‌వో మీనాకుమారి, సభ్యులు లక్ష్మి, శృతిక పాల్గొన్నారు.

317 సమస్యను పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: 317 జీవో బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా సొంత జిల్లాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హేమంత్ షిండే, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



జిల్లా కేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు



కాగజ్‌నగర్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్ రూరల్: మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా గురువారం పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. జామా మసీదు నుంచి ర్యాలీ ప్రారంభించగా, రైల్వేస్టేషన్, అంబేద్కర్ చౌక్, రాజీవ్‌చౌక్, ఎన్టీఆర్ చౌక్, సర్‌సిల్క్ చౌరస్తా మీదుగా సాగింది. పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మజ్జిగ, శీతల పానీయాలు, పండ్లు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, పట్టణ సీఐ శంకరయ్య భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జామా మసీద్ నుంచి వివేకానంద చౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్‌ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జామా మస్జీద్‌లో అన్నదానం చేశారు. మత పెద్దలు మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త చెప్పిన శాంతి మార్గంలో నడవాలని, మహ్మద్ ప్రవక్త చూపించిన బాటలో నడుస్తూ సేవతత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బాసిత్, శంషాద్ హుస్సేన్, సాజిద్, రహమాన్, నిసార్, పెంటూ, ఇమ్రాన్, ఉబెద్ బిన్ యాహియా, తాజ్, ఖలీల్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

నేరడిగొండ: విద్యాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని తేజాపూర్‌లో జెడ్పీఎస్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అంతకుముందు వినాయకుడి మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ వ్యవసా య మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, అల్లూరి ప్రపుల్‌చందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, మౌలాన, గడ్డల నారాయణ, క్రాంతి పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకరమ్మ

పెంచికల్‌పేట్: పంచాయితీ ఓటరు జాబితా సవరణలపైన మండల రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో అల్బర్ట్ సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో ప్రచురించిన ఓటరు వార్డు జాబితా మ్యాపింగ్‌లో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. వార్డుల్లో మార్పులు, చేర్పులు ఉంటే పంచాయతీ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు బండు, మధుకర్, శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: ఓటరు ముసాయిదా జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లోగా లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో 24 పంచాయతీలలో 200 వార్డుల ఓటరు ముసాయిదా జాబితాపై వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఓటరు నమోదుపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవరించిన ఓటరు జాబితాను పార్టీ నాయకులు పరిశీలించారు. వార్డుల వారీగా సవరించినట్లు ఎంపీవో ఖాజా అజిజుద్దీన్ తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని 236 వార్డులలో 28240 మంది ఓటర్లను గుర్తించినట్లు తెలిపారు. జాబితాలో ఎలాంటి తప్పిదాలు ఉన్నా.. పేర్లు రాకున్నా తమ దృష్టికి తీసుకురావాలని నాయకులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, బీజేపీ మండల కార్యదర్శి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఎంపీడీవో శంకరమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 21లోగా లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసుదేవ్, కాంగ్రెస్ నాయకులు లావుడ్య రమేశ్, దుర్గం దేవాజీ, గంటుమేర, బీజేపీ నాయకులు గోలెం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ జాబితాను విడుదల చేసి కార్యాలయాల్లో ప్రదర్శించిమని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు నారులే వాసుపటేల్, బండురావు, సత్తయ్య, తిరుపతి, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే ఈనెల 21లోగా తెలపాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించారు. అనంతరం రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. నాయకులు జీవన్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన వాటా చెల్లించాలి



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలు వెల్లడించి, కార్మికులకు మెరుగైన లాభాల వాటా చెల్లించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. సింగరేణి లాభాల వాటా చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ గురవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో సింగరేణి సంస్థ నిర్దేశించిన 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్లు కృషి చేశారన్నారు. ఆరు నెలలుగా సంస్థ ఆర్జించిన వాస్తవ లాభాలను ప్రకటించటంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు పోరుబాట పట్టక ముందే యాజమాన్యం లాభాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ తరహాలో ప్రస్తుతం కూడా లాభాల వాటాను 35 శాతానికి పెంచి, ఈ నెలాఖరులోగా చెల్లిందుకు కృషి చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మారిన వెంకటేశ్వర్లు, అలవేని సంపత్, మంగీలాల్, సమ్మయ్య, ఓరం కిరణ్, మహేందర్, శ్రీనివాస్, గణపతి, వీరస్వామి, శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



కార్మికులతో మాట్లాడుతున్న అంబాల ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఓసీపీ ఓబీ పనుల్లో విధుల్లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని సింగరేని కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ వద్ద బ్లాస్టింగ్ కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు చెల్లించకుండా శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. వేతనాలు చెల్లించేలా ఏరియా జీఎం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. లేదంటే జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు.


ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. డిమాండ్ డే సందర్భంగా గురువారం ఆర్టీసీ జేఏసీ పి లుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలు, డీఏ వెంటనే ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డులు రద్దు చేసి ట్రేడ్ యూనియన్లు పునరుద్ధరించాలని, ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సస్పెండ్ చేసిన, తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. తార్నాక ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలన్నారు. సమ్మె కాలంలో ఉద్యోగులపై నమోదైన పోలీసు కేసులు ఎత్తివేయాలని, హైర్ బస్సు డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ దివాకర్, నాయకులు అశోక్, ఇజాజ్, శ్రీధర్, శ్రీనివాస్, సురేశ్, లక్ష్మణ్, రాంకుమార్, ఆనంద్‌రావు, పోశం పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి

కాగజ్‌నగర్ రూరల్: విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. గురువారం డిగ్రీ విద్యార్థులకు టాస్క్‌పై శిక్షణ ఇచ్చారు. టాస్క్ గురించి విద్యార్థులకు వివరించారు. తెలంగాణ అకాడమీ ఫర్ సిల్క్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) గురించి శిక్షణ ఇవ్వడమే కాకుండా దాని ప్రాధాన్యత, భవిష్యత్‌లో శిక్షణ వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో టాస్క్ ఫ్యాకల్టీ మెంబర్ సాయికుమార్, కోఆర్డినేటర్ దత్తాత్రేయ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహం, అధ్యాపకులు జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.